రెవెన్యూ వసూళ్లకు ప్రత్యేక బృందాలు

- 9 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలపై ప్రత్యేక దృష్టి
- బృందాలను నియమిస్తూ అదనపు కమిషనర్ ఉత్తర్వులు జారీ

కర్నూలు (టౌన్): రెవెన్యూ వసూళ్లపై నగరపాలక అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నెల రోజుల క్రితం ఇదే విభాగంలో ఇన్‌చార్జ్‌లుగా ఇతర విభాగాల్లో ఉన్న ఎనిమిది మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను తప్పించారు. వారి స్థానంలో ఐదుగురిని కొత్తగా నియమించారు. కొత్త వారు కావడం, ఆర్థిక సంవత్సరం నాలుగైదు నెలల వ్యవధిలో ముగుస్తుండటంతో బకాయిలు వసూలు చేసేందుకు నగరపాలక కమిషనర్ సోంగా రవీంద్రబాబు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ నాలుగు స్పెషల్ టీమ్‌లను నియమించారు. ఒకటి కాదు.. రెండు కాదు. కర్నూలు నగరంలో గత 9 సంవత్సరాలుగా ఇంటి బకాయిలు, ప్రభుత్వ భవనాల బకాయిలు ఉన్నట్లు నగరపాలక ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా పన్నులు చెల్లించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన భవన యజమానులపై ఇక కొరడా ఝులిపించనున్నారు. రెవెన్యూ విభాగం పరిధిలోని 1.39 లక్షల ఇళ్లకు సంబంధించి పెండింగ్ బకాయిలను ఇప్పటికే గుర్తించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి బకాయిలు వసూలు చేసేందుకు నగరపాలక యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగానే మొండి బకాయిల వసూళ్లకు నాలుగు బృందాలను నియమించారు. ఈ బృందాల పనితీరును ప్రతి రోజు అదనపు కమిషనర్ పర్యవేక్షణ చేయనున్నారు.

ప్రత్యేక టీమ్‌లో ఏవరెవరంటే..

ఐదు నెలల వ్యవధిలో రూ.23 కోట్ల మొండి బకాయిలు వసూలు చేసేందుకు ఈ టీమ్‌లను నియమించారు. మొదటి టీమ్‌లో టీ.అబ్దుల్ వాజిద్ (సూపరింటెండెంట్), ఆర్.రాజు (జూనియర్ అసిస్టెంట్), వార్డు అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, అమినిటీస్ కార్యదర్శి, రెండవ టీమ్‌లో పి.సాధిక్ హుస్సేన్ (సీనియర్ అసిస్టెంట్), వార్డు అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, అమినిటీస్ కార్యదర్శి మూడవ టీమ్‌లో జి.సుహేయిల్ (జూనియర్ అసిస్టెంట్), వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, అమినిటీస్ కార్యదర్శి, నాలుగవ టీమ్‌లో ఎండి.ఖలీల్ రెహమాన్ (జూనియర్ అసిస్టెంట్), వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, అమినిటీస్ కార్యదర్శి)లకు ఈ బాధ్యతలు అప్పగించారు. వీరంతా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేయాల్సి ఉంటుంది. రెగ్యులర్ విధులతో పాటు ప్రస్తుత పన్ను వసూళ్లతో పాటు అరియర్స్‌లను వసూలు చేయాల్సి ఉంటుంది.


నగర పాలక సంస్థ కార్యాలయం

అసెస్‌మెంట్లు 355 – బకాయిల మొత్తం రూ.23.63 కోట్లు

దీర్ఘకాలికంగా బకాయిలు చెల్లించకుండా ఉన్న అసెస్‌మెంట్లను నగర పాలక రెవెన్యూ విభాగం అధికారులు గుర్తించారు. మొత్తం 355 అసెస్‌మెంట్ల నుంచి ఏళ్ల తరబడి బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం కార్యాలయాలతో పాటు ఈ బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీరందరికీ చివరిసారిగా నోటీసులు జారీ చేసి పన్ను వసూళ్లకు రంగం సిద్ధం చేశారు. ప్రత్యేకంగా నాలుగు టీమ్‌లకు ఈ బాధ్యతలు అప్పగించారు. ప్రతి రోజూ పన్ను వసూళ్ల ప్రగతిని పర్యవేక్షణ చేస్తారు. 2024–2025 మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పన్ను బకాయిలు, పెనాల్టీ, వచ్చే మార్చి నాటికి నాలుగు టీమ్‌లు కలిసి రూ.23,63,71,563 వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటికే కమిషనర్ ఆదేశాల మేరకు పన్ను వసూళ్ల ప్రక్రియను ప్రారంభించినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సత్కారం


అమతుర్ రహీంను సన్మానిస్తున్న వీసీ పి.ఎస్.షావలి ఖాన్, వి.లోకనాథ్

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీ ఉర్దూ శాఖలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఖాజి అమతుర్ రహీంను వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఎస్.షావలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ్ శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సన్మానించారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో ఆమె రాష్ట్ర ఉర్దూ అకాడమీ అధికారుల చేతుల మీదుగా ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అమతుర్‌ను సన్మానించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


దినేష్ (ఫైల్)

కర్నూలు (టౌన్): మూడవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. స్థానిక స్వామిరెడ్డినగర్‌లో ఆటో డ్రైవర్‌గా పనిచేసే దినేష్ ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తండ్రి అంజనేయులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు బంగారుపేటకు చెందిన నీలిషికారి రాజేశ్వరిని ప్రేమించాడని, ఆమె, ఆమె బంధువులపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అదృశ్యమైన యువకుడు 5.5 అడుగుల ఎత్తు, ఇంటి నుంచి వెళ్లినప్పుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, తెలుపు టీషర్టు వేసుకున్నాడని, ఆనవాలు తెలిస్తే మూడవ పట్టణ పోలీసుస్టేషలో తెలియజేయాలని కోరారు.

రోగుల డిశ్చార్జ్ సమ్మరీ అప్‌లోడ్ చేయాలి


సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలోని అన్ని విభాగాలు విధిగా రోగుల డిశ్చార్జ్ సమ్మరీని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వైద్యులను ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఈ-హాస్పిటల్ డిశ్చార్జ్ మాడ్యుల్ ట్రెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ-హాస్పిటల్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ శ్రీరాములు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఈ-హాస్పిటల్ నోడల్ అధికారి డాక్టర్ శివబాలనాగాంజన్, ఎన్‌వీసీ రోల్ అవుట్ మేనేజర్స్ సురేష్, జగదీష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు న్యూసిటీ: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఊర్జవీర్ ఎనర్జీ ఎఫిషియన్సీ వారియర్స్ కీలకంగా మారతారని విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఉమాపతి తెలిపారు. నగరంలోని విద్యుత్తు భవన్‌లో.. ఊర్జవీర్ ఎనర్జీ ఎఫిషియన్సీ వారియర్స్ పథకంలో భాగంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఈ ఉమాపతి మాట్లాడుతూ.. పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 1.2 లక్షల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను విద్యుత్ శాఖలో భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. వారి ద్వారా నాణ్యమైన విద్యుత్తు సేవలు సత్వరం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యుత్ తనిఖీ అధికారి అజయ్‌బాబు, ఈఈఎస్ఎల్ జిల్లా కో-ఆర్డినేటర్ జగదీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స ద్వారా న్యూమోనియా నియంత్రణ

కర్నూలు(హాస్పిటల్): న్యూమోనియా అతి పెద్ద అంటువ్యాధి అని, ఈ వ్యాధి సోకిన వ్యక్తి దగ్గడం, తుమ్మడం వల్ల క్రిములు మనం పీల్చే గాలిలోకి వ్యాప్తి చెందుతాయని పల్మనాలజిస్టు డాక్టర్ కె.వినోద్‌ఆచారి, డాక్టర్ సువర్ణలక్ష్మి, ఆస్పత్రి క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి చెప్పారు. ప్రపంచ న్యూమోనియా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ.. బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ ఇన్‌ఫెక్షన్ల కారణంగా ఊపిరితిత్తుల్లోని గాలి సంచుల్లో ద్రవం, చీము చేరి శ్వాస తీసుకోవడం కష్టమవుతుందన్నారు. సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా న్యూమోనియాను నియంత్రించవచ్చన్నారు.

ఎంఆర్‌పీకే మద్యం విక్రయించాలి

కర్నూలు (టౌన్): ఎంఆర్‌పీకే మద్యం విక్రయాలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి స్పష్టం చేశారు.మంగళవారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల ఎక్సైజ్ శాఖ అధికారులతో డిప్యూటీ కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. బెల్ట్ షాపులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రైవేటు మద్యం వ్యాపారుల విక్రయాలపై తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

చందనబ్రదర్స్ షోరూంలో చోరీ

కర్నూలు (టౌన్): రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న చందన బ్రదర్స్ షోరూంలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు షాపింగ్ మాల్‌లోకి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌ను బలవంతంగా తెరచి అందులోని రూ.2.35 లక్షల నగదు చోరి చేసి ఉడాయించాడు. షోరూం మేనేజర్ మునీశ్వరరావు మంగళవారం యథావిధిగా షోరూం తెరచి చూడగా క్యాష్ కౌంటర్‌లో నగదు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఫిర్యాదు మేరకు క్లూస్ టీమ్, కర్నూలు రెండవ పట్టణ పోలీసులు దొంగ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, కరెంట్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాపోరు యాత్రలో భాగంగా 14, 16 వార్డుల పరిధిలోని బుధవారపేటలో సీపీఎం నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అమ్మకు వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు తదితర పథకాలకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. అధికారంలో లేని సమయంలో ధరల పెరుగుదలపై పోరాటం చేసిన టీడీపీ నాయకులు.. ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కేజీ బియ్యం రూ.70, కేజీ వంటనూనె రూ.160 వరకు ధరలు పెరిగినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రజలపై ఒకేసారి రూ.20 వేల కోట్ల కరెంట్ చార్జీలను ట్రూఅప్ పేరిట బాదేందుకు సిద్ధమైన నేపథ్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎండీ ఆనంద్‌బాబు, నాయకులు బజారి, ధన్‌రాజ్, దేవరాజ్, రాజు, బాలరాజు పాల్గొన్నారు.


ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు(సెంట్రల్): జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో బంగారు పతకాలతో తిరిగి రావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా క్రీడాకారులకు సూచించారు. డిసెంబర్‌లో కోల్‌కతాలో జరిగే జాతీయస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో.. ఇటీవల కాకినాడలో నిర్వహించిన అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్ పోటీల్లో అండర్–19 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన కనిష్క, హేమంత్‌కుమార్, వర్షిత, వినీల, అండర్–14లో బ్రాంజ్ మెడల్ సాధించిన గిరీష్మాదేవిలను అభినందించారు. డీఎస్‌డీఓ భూపతి, జిమ్నాస్టిక్ కోచ్ టి.పవన్‌కుమార్ ఉన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

తుంగభద్ర జలాల కేటాయింపుల్లో సవరణ

కర్నూలు (సిటీ): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర డ్యాం నీటి కేటాయింపు వాటాలను సవరించారు. మూడు రాష్ట్రాల డ్యాం ఇంజినీర్లు మంగళవారం జూమ్ యాప్ ద్వారా సమావేశమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు టీబీ డ్యాంలోకి వచ్చే నీటిని అంచనా వేసి ఆయా రాష్ట్రాల్లోని సాగు నీటి కాలువలకు దామాషా ప్రకారం కేటాయింపులు చేశారు. కాగా కర్ణాటక రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో డ్యాంకు నీటి చేరిక పెరిగింది. ఈ మేరకు నీటి వాటా సవరణలు చేశారు. ఎల్లెల్సీ కాలువకు 19.472 టీఎంసీల నుంచి 21.736 లకు పెంచారు. ఇప్పటివరకు ఈ కాలువ కింద 8.526 టీఎంసీల నీటిని వినియోగించుకోగా ఇంకా 13.210 టీఎంసీల మేర రావాల్సి ఉంది. అదేవిధంగా హెచ్ఎల్‌సీ వాటా 26.368 టీఎంసీల నుంచి 29.434లకు పెంచారు. ఇప్పటివరకు 18.629 టీఎంసీల నీటిని వినియోగించుకోగా ఇంకా 10.805 టీఎంసీలు రావాల్సి ఉంది. కేసీ కాలువకు 8.113 టీఎంసీల నుంచి 9.057 లకు పెంచారు. కేసీ వాటా నీరు ఇంతవరకు వినియోగించుకోలేదు. జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది డ్యాంకు భారీగా నీరు చేరినందున అంచనాలను 212 టీఎంసీలకు పెంచి కేడబ్ల్యూడీపీ చేసిన కేటాయింపుల మేరకు పూర్తిస్థాయి వాటా నీటిని ఇవ్వాలని టీబీ బోర్డు ఇంజినీర్లకు సూచించారు. సమావేశంలో అంచనా వేసిన 192 టీఎంసీలకు అంగీకరించాలంటే వాటా మేరకు నీటి కేటాయింపులను పూర్తిస్థాయిలో కేటాయిస్తేనే తీర్మానాలపై సంతకాలు చేస్తామని ఎస్ఈ బోర్డు ఇంజనీర్లకు తెలియజేశారు. నీటి కేటాయింపులపై బుధవారం అధికారికంగా స్పష్టత రానుంది.

18న చలో కలెక్టరేట్

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 18వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జె.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరిబాయి చెప్పారు. ఈ మేరకు మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వారు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యేడాది ఫిబ్రవరి 9న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర బృందంతో ప్రభుత్వం చర్చలు జరిపిందని, చర్చలు ఫలించడంతో జీఓ రూపంలో హామీ కూడా ఇచ్చిందన్నారు. ఆ హామీలను అమలు చేయాలని నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామని, ఇప్పటివరకు అమలుచేయక పోవడంతో 18న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, ఉపాధ్యక్షులు లలితమ్మ ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు


కర్నూలు (టౌన్): నగరంలో వివిధ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని గీతానగర్, మురహరినగర్, నిర్మల్‌నగర్, ధనలక్ష్మీ నగర్, గురు రాఘవేంద్ర నగర్, సుంకేసుల రోడ్డు, నంద్యాల చెక్ పోస్టు తదితర ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. రెండు రోజుల క్రితం కాలనీవాసులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రాలు ఇచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఆయా కాలనీలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ క్రిష్ణలత, ఏఈ భానుప్రకాష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి ఉన్నారు.

ఆలయాల నిర్వహణలో సంస్కరణలు తేవాలి

కర్నూలు కల్చరల్: దేవాలయాల నిర్వహణలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత సహ కార్యవాహ మాలపాటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక బుధవార పేటలోని కేశవ్ మెమోరియల్ పాఠశాలలో ఆర్ఎస్ఎస్ వివిధ క్షేత్ర కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయ ట్రస్టు బోర్డుల్లో రాజకీయ పార్టీలతో ప్రమేయం లేని హిందూ దైవ భక్తులను నియమించాలన్నారు. హిందూ ఆలయాలకు ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజంపై, ఆలయాలపై ఉన్మాదంతో దాడులు చేస్తున్న విద్రోహులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు రఘువీర్, ఎస్వీఎస్ గుప్త, శేషఫణి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలుచేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చినా అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. అనంతరం జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయ, భైరాపురం రాజు, గూడూరు ప్రతాప్, విహారీదాస్, రాజశేఖర్, సుజాతమ్మ, అయ్యన్న పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సైన్స్ టీచర్లకు శిక్షణ

కర్నూలు సిటీ: సైన్స్ టీచర్లకు లెర్నింగ్ సైన్స్ స్టాండర్డ్స్‌పై మంగళవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్ హాజరై ప్రసంగించారు. వస్తువులు, పదార్థాల నాణ్యత ప్రమాణాలను తెలియజేసేందుకు పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్‌లను ఏర్పాటు చేయడంతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్‌ను ఆయన అభినందించారు. ఆ తరువాత బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ డి.వివేక్‌వర్ధన్ రెడ్డి నాణ్యత, ప్రమాణాల గురించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, ఎంఈఓ వినోద్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

17న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 17వ తేదీన జిల్లా స్థాయి బాలబాలికల బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భానుప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో పశ్చిమగోదావరి జిల్లా మాటేరు గ్రామంలో జరిగే 10వ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 95024 56556 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్వల్పంగా తగ్గిన ఉల్లి ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర స్వల్పంగా తగ్గింది. మంగళవారం మార్కెట్‌కు 573 మంది రైతులు 11305 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులను తెచ్చారు. కనిష్ట ధర రూ.522, గరిష్ట ధర రూ.4619 లభించింది. సోమవారం గరిష్ట ధర రూ.4850 లభించింది. మోడల్ ధర రూ.3991 నమోదుకాగా సోమవారం నాటితో పోలిస్తే క్వింటాలుపై రూ.241 ధర తగ్గింది. వ్యాపారులు సిండికేట్ కావడం వల్లనే ధరలు తగ్గినట్లుగా రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

8న వెనుకబడిన జిల్లాల సదస్సు

కడప సెవెన్‌రోడ్స్: అభివృద్ధిలో వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సదస్సు డిసెంబరు 8వ తేదీన వైఎస్సార్ జిల్లాలో నిర్వహించనున్నట్లు ఉక్కు సాధన ఐక్యవేదిక అధ్యక్షుడు నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా విభజన చట్టంలోని కడప స్టీల్ ప్లాంటు నిర్మాణాన్ని ఇప్పటి వరకు చేపట్టలేదన్నారు. బడ్జెట్‌లో రూ.25 కోట్లు దీనికి కేటాయించడాన్ని బట్టిచూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. స్టీల్ ప్లాంటు నిర్మాణ బాధ్యత కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కార్‌దేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణం పట్ల చూపుతున్న శ్రద్ధ వెనుకబడిన జిల్లాలపై చూపడం లేదని విమర్శించారు.

ప్లానింగ్ కార్యదర్శులు తీరు మార్చుకోవాలి

కర్నూలు (టౌన్): టౌన్ ప్లానింగ్ కార్యదర్శులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. పద్ధతి మార్చుకోవాలని టౌన్ ప్లానింగ్ ప్రాంతీయ సంచాలకులు సంజీవ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగంపై వచ్చిన ఫిర్యాదులు, అవినీతి ఆరోపణలకు సంబంధించి అధికారులు, ఏసీపీ, ప్లానింగ్ కార్యదర్శులపై విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఫిర్యాదులు చేసిన ప్లానింగ్ సర్వేయర్లతోను రీజినల్ డైరెక్టర్ మాట్లాడారు. తమను పక్కన పెట్టి అంతా టౌన్ ప్లానింగ్ విభాగం ప్లానింగ్ కార్యదర్శులు చేస్తున్నారని ఫిర్యాదులు చేశారు. నగరంలో మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా ప్లానింగ్ కార్యదర్శులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. స్పందించిన ఆర్‌డీ టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కలిసి టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరు గురించి చర్చించారు.

24న కురువల కార్తీక వనభోజనాలు

కర్నూలు(అర్బన్): స్థానిక పెద్దపాడు రోడ్డు మోడల్ స్కూల్ సమీపంలోని భీరప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో ఈ నెల 24న కురువల కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించనున్న ట్లు ఆ సంఘం నేతలు తెలిపారు కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవా రం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆవిష్కరించారు. జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. కురువల కార్తీక వనభోజన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా కర్నూలు, హిందూపురం ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బీకే పార్థసారథి, రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవితతో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని కురువ వర్గీయులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.


ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న కురువ సంఘం నేతలు

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖలో జీఓ నంబర్ 43/32లను అనుసరించి మిగులు సిబ్బంది పేరుతో రెగ్యులర్, సెకండ్ ఏఎన్ఎంలను 3 వేల మందిని జీఎన్ఎం ట్రెనింగ్ కోసం పంపించారన్నారు. మరో 3,500 మంది సీనియర్ ఏఎన్ఎంలను రీ డిప్లాయిమెంట్ పేరుతో వారి ఒరిజినల్ ఉప కేంద్రాల నుంచి సుదూర ప్రాంతాలకు పంపించారన్నారు. అయితే ఇటీవల జీఎన్ఎం ట్రెనింగ్ పూర్తి చేసుకున్న ఏఎన్ఎంలు వారి స్థానంలో చేరడం వల్ల అక్కడ ఒకరికన్నా ఎక్కువ మంది ఏఎన్ఎంలు పనిచేయాల్సి వస్తోందన్నారు. రీ డిప్లాయిమెంట్‌ను వెంటనే రద్దు చేసి ఏఎన్ఎంలను వారి ఒరిజినల్ స్టాఫ్‌కు పంపాలని పలుమార్లు సీహెచ్ఎఫ్‌డబ్ల్యుకు విన్నవించగా ఒరిజినల్ స్థానాలకు పంపించాలని ఆయన మౌఖికంగా తెలిపారన్నారు. కావున ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్)/సెకండ్ ఏఎన్ఎం, గ్రేడ్–3 ఏఎన్ఎంల రీడిప్లాయిమెంట్‌ను వెంటనే రద్దు చేసి స్వస్థలాలకు పంపాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు, జిల్లా అధ్యక్షులు ఎ.మాధవరాజు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు న్యూసిటీ: నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీ ఫీడర్‌లో మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ శేషాద్రి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోతలు విధించనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

15 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 15వ తేదీ నుంచి స్కూల్ గేమ్స్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్–14, అండర్–17 విభాగంలో మార్షల్ ఆర్ట్స్‌లో బాలబాలికలకు అలాగే ఈనెల 18వ తేదీన క్యారమ్స్ పోటీలు ఉంటాయని వెల్లడించారు. క్యారమ్స్ క్రీడాకారులు స్ట్రైకర్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అలాగే బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు.